# శ్రీదత్తవాణి

## ఆధ్యాత్మిక ద్వైమాసిక పత్రిక




శ్రీ దత్తజయంతి, శివరాత్రి, శ్రీరామనవమి. శ్రీకృష్ణాష్టమి,
వినాయక చవితి, దుర్గాష్టమి సంచికలు



# అడుగో అల్లడుగో వేంకట దత్తుడు

(చివరి పేజి చూడండి)

**ఇతర భక్తులచే చదివించండి**

**ఈ సంచికను సమర్పించిన వారు**

శ్రీ ఆత్కూరు శేషాద్రి, శ్రీమతి లలిత దంపతులు, విజయవాడ.

ముఖచిత్రం: స్వామి దత్తవేషంలో, కృష్ణవేషంలో, స్వవేషంలో (సమర్పణ: శ్రీ పి.శర్మ)

VOL-1: ISSUE-1: విషయసూచిక


శ్రీ దత్త గణపతి భజన ........ 4

సంపాదకీయం ........ 5

మహిమ యమున ........ 6

మేము మాగురుదేవులు ........ 7

గురుపూర్ణిమ సందేశము (ఉదయము) ........ 8

గురుపూర్ణిమ సాయంకాల దివ్యప్రవచనము ........ 11

విశ్వమత సమన్వయము ........ 18


మనవి

శ్రీ దత్త గురు భగవానుని మహిమలు, జ్ఞాన బోధలు, భజనలు అన్ని భారతీయ భాషలలో దేశమంతటా ప్రచారము చేయుటకు, విదేశములకు సైతం ఇంగ్లీషులో విస్తృత ప్రచారము కొరకు, దైవానుగ్రహము వలన ఆర్థిక శక్తి కలవారు వారి వారి భక్తిననుసరించి ఈ సేవలో పాల్గొనండి. 80-జి ప్రకారము ఇన్ కంటాక్సు మినహాయింపు సౌకర్యమును కూడా ఏర్పాటు చేయుచున్నాము. ఈ 6 పండుగలలో ఒక పండగ సంచికను మీరు స్పాన్సర్ చేయు అవకాశము కలదు. ప్రతి నెల పూర్ణిమనాడు గురుపూజలో స్వామి దివ్య చరణముల వద్ద గురుదక్షిణ సమర్పించు పద్ధతి ప్రారంభించబడినది. అన్ని విరాళములు డి.ఎస్.కె.ఎస్.ఎన్.మూర్తి గారి పేరున పంపవలయును. సంప్రదించవలసిన చిరునామా.


**డి.ఎస్.కె.ఎస్.ఎన్.మూర్తి**, C/o సి.బాలకృష్ణమూర్తి, ఇ.నెం: 41-15-5, నల్లగేట్ డౌన్, కృష్ణలంక, విజయవాడ-13. ఫోన్. 2521809

డి.ఎస్.కె.ఎస్.ఎన్.మూర్తి. ఫోన్. 2531167.

ఎస్.భీమశంకరం, ఫోన్. 2531167.

E-mail address: datta_swami@yahoo.co.in



Edited and published by A.Seshadri. Printed at Divya Graphics, Vijayawada.

# శ్రీ దత్త గణపతి భజన

స్వామి ఆశువుగా చెప్పిన "భక్తిగంగ" గ్రంధము నుండి గ్రహించిన ఈ భజనతో సంచికను ఆరంభిస్తున్నాము. – శ్రీమతి కె.పద్మారమ్, కాకినాడ.

1. శ్రీ దత్తగణపతిం భజే - ఉన్మత్త నటన తాండవమ్ |
మత్తేభవదన భాసురం - చిత్తాబ్జ బోధ భాస్కరమ్ ||
2. ఆయత్త యోగరాజితం - విత్తేశ నిత్యపూజితమ్ |
ఉత్తనపాణి ముద్రితం - శ్రీకృత్తి వాసస స్సుతమ్ ||
3. కైలాస ద్రుషది నర్తనం - భక్తాంతరంగ వర్తనమ్ |
పాపౌఘ పాశకర్తనం - శ్రీ పార్వతీసుతం భజే ||
4. లంబోదరాంగ తాండవం - ముద్రాకరాబ్జ పండితమ్ |
సర్వాంగ నాగమండనం - వందే వినాయకం పతిమ్ ||
5. ధింధిమ్మి తకిట మర్దలం - భంభం నినాద శంఖకమ్ |
ఆనంద నృత్యతత్పరం - ధ్యాయామి ప్రమధనాయకమ్ ||
6. ఆమోదకర మోదకం - వేదాంతమతి మాదకమ్ |
దుష్కర్మ ఫల సాదకం - విఘ్నేశ్వరం గురుం భజే ||
7. సృష్టి స్థితి లయ కారణం - మూషాఖ్య దైత్య మారణమ్ |
సంసార జలధి తారణం - స్వామి ప్రభు నరవారణమ్ ||
8. పంచాస్య మాది దైవతం - దేవర్షిభి స్సమర్చితమ్ |
ఆలోక గళిత సంచితం - విఘ్నాధి నాధ మాశ్రయే ||
9. లోకైక పరమ వైభవం - లోకేశ్వరాది సంభవమ్ |
ఆలోక పరిహృతోద్భవమ్ - ఆలోకయే పరంభవమ్ ||
10. శ్రీకృష్ణ కవి నివేదితై: - శ్లోకాఖ్య మోదకై రిమై: |
ఆనంద గణపతిం పతిం - ఆరాధయంతు సాధకా:

### 1=33 కోట్లు !?

త్రిమూర్త్యాత్మకుడు, స్మరణ మాత్ర సంతుష్టుడు అయిన శ్రీ గురుదత్తుని నుండి త్రిమూర్తులు ఉద్భవించారు. వారి నుండి 3 కోట్ల దేవతలు ఉద్భవించారు. వారి నుండి 33 కోట్ల దేవతలు ఉద్భవించారు. కావున శ్రీ గురుదత్తునికి పెట్టిన ఒక్క నమస్కారము 33 కోట్ల దేవతలకు పెట్టినట్లే. 33 కోట్ల దేవతల వేషధారయగు శ్రీ దత్తుడే పరబ్రహ్మము. ఇది వేదము ద్వారా నిరూపితమైన సత్యము.

--స్వామి.

# సంపాదకీయం

**(స్వామి, సంచికల గురించి)**

శ్రీ జన్నాభట్ల వేనుగోపాల కృష్ణమూర్తి, ఎం.ఎస్.సి, పి.హెచ్.డి., కెమిస్ట్రీ ప్రొఫెసర్ భక్తుల చేత 'స్వామి' లేక 'దత్తస్వామి' గా పిలువబడుతున్నారు. నేటి తరానికి అధ్యాత్మిక తత్త్వమును బోధించాలంటే "సైన్సు అంటే నవీన తర్క శాస్త్రము కావాలి" అంటారు స్వామి. స్వామి 19 సంవత్సరముల వయస్సులో పి.హెచ్.డి డిగ్రీని పొందినారు. 11వ ఏటనే సంస్కృతములో వందకు పైగా గ్రంధములు వ్రాసినారు. ఈ గ్రంధాలలో శంకర-రామానుజ-మధ్వ గురుత్రయము యొక్క భాష్యాలను సమన్వయము చేసి మూడింటిలోను ఒకే సిద్ధాంతమున్నదని నిరూపించినారు. ఉత్తర-దక్షిణ భారత దేశంలో 12 సంవత్సరాలు సంచరించి అనేక పండితులతో వాదోపవాదములు చేసినారు. స్వామి ఇచ్చిన దివ్య ఉపన్యాసాలు "జ్ఞాన సరస్వతి" శీర్షిక కింద అనేక గ్రంధాలుగా ముద్రించబడినవి. స్వామి ఆశువుగా చెప్పిన భక్తిగీతాలను "భక్తిగంగ" అను గ్రంధముగా ముద్రించబడినవి. స్వామి దత్తవేదము, దత్తభగవద్గీత, దత్తోపనిషత్తులు, మొదలగు పవిత్ర గ్రంధములను అందించినారు. స్వామి చేసిన దివ్య మహిమలు "మహిమ యమున" అను గ్రంధముగా ప్రచురించబడినవి. దత్తసేవకు మూల స్తంభములగు శ్రీ చిలుకూరు బాలకృష్ణమూర్తిగారు, భవాని గారు అందరికీ చిరస్మరణీయులు.

"అన్నార్తులకు అన్నము, జ్ఞానార్తులకు జ్ఞానము, భక్తిని పంచినచో ఆ సేవ నిజముగా మీ లెక్కలోనికి చేర్చబడును" అంటారు స్వామి. భక్తులు స్వామిని దత్తావతారముగా గుర్తించి విశ్వసిస్తున్నారు. స్వామి ప్రసాదించిన అనేక దివ్య ఉపన్యాసాలను ఈ బ్లాగు ద్వారా పొందగలరు. ఈ దత్తసేవలో పాల్గొని ఇతర భక్తులు కూడా శ్రీ దత్త ప్రభువుల యొక్క అనుగ్రహమును, ఆశీస్సులను పొందుదురుగాక!

శ్రీ దత్తప్రభువు ఒక్కరే ఈ విశ్వమునకు గురువుగా, పరమాత్మగా ఉన్నారు గదా.

**శ్రీ ఆత్కూరి శేషాద్రి**

**ఎడిటర్**

# మహిమ యమున

ఈ శీర్షికలో స్వామి చూపిన కొన్ని మహిమలను మహిమ యమున గ్రంథము నుండి మీ ముందు పొందుపరుస్తున్నాము. (ఈ గ్రంథము ముద్రించబడినది)

(డి.అజయ్ కుమార్, నాగలక్ష్మి)

మా ఇంటికి ఎదురు ఇంటిలో ఉన్న సీతమ్మగారికి స్వామి ఒకసారి సువర్ణ కాంతితో మెరుస్తూ మూడు ముఖాలు, ఆరు చేతులతో శ్రీ దత్తమూర్తిగా సాక్షాత్కార దర్శనమిచ్చినారు. దానితో ఆమె మూడు రోజులపాటు తీవ్రావేశము కలిగి తన్మయావస్థలో ఉండి ఆ దర్శనము గురించి మా అందరికీ ఎంతో వర్ణించి, వర్ణించి చెప్పినది.

పిడబ్ల్యుడిలో పని చేయుచున్న మా మిత్రుడు సుబ్రహ్మణ్యంగారు ఒక సారి నాతో కలసి స్వామిని చూడటానికి వచ్చినారు. తాను గాణుగాపురం పోయి అక్కడే జీవితాంతము ఉంటానన్నారు స్వామితో. “నీవె పోనవసరము లేదులే. నీకు స్వామి ఇచ్చటనే దర్శనమిస్తారులే” అన్నారు స్వామి. పది రోజులలోనే ఆయనకు క్యాన్సర్ వ్యాధి రావడం, మైసూరు ఆసుపత్రిలో నెల లోనే మరణించుట జరిగినది. ఆయన చివరి క్షణాలలో ‘శ్రీదత్తప్రభువు’ సాక్షాత్కరించినారుట. ఆయన భార్యతో ఆయన చెప్పిన చివరి మాటలు ఇవి “నాకు దత్త ప్రభువు సాక్షాత్కరించిరారు. ఆ ప్రభువు ముఖం సాక్షాత్తు విజయవాడలో నున్న స్వామి ముఖమే. మూడు ముఖాలతో, ఆరు చేతులతో వెలుగుతున్నారు. ఆయన పాదాలవద్ద ఒక ఋషి ఆసీనుడై ప్రభువు మీదకు పుష్పాలను పైకి ఎగురవేస్తూ స్వామి మీద పడేలా చల్లుతున్నారు. నీవు విజయవాడ పోయి స్వామిని దర్శించుకో. ఆయన సాక్షాత్తు దత్తుడు. తరిస్తావు” అని అంటూ కన్ను మూసినారు. ఆయన భార్య వచ్చి నాతో ఈ విషయములను చెప్పినది.

తిరుపతి భక్తులనుండి ఈ సమాచారము అందినది. తిరుపతిలో ఖాదీ కాలనీలో జి.శివరామమూర్తిగారి ఇంటిలో స్వామి మూడు రోజులు దత్తభజన చేసినారు. చివరి రోజున అనేక భక్తులు స్వామికి నమస్కరిస్తున్నారు. శివరామమూర్తిగారి కోడలు చి.సౌ.వల్లి భజనకు వచ్చిన భక్తుల సేవలను ఎంతో శ్రద్ధగా చేసినది. ఆమె నమస్కరించగానే స్వామి “నన్ను చూడుము. ఇప్పుడు నీకు నేను ఎలా కనబడుతున్నానో అందరికీ చెప్పు” అన్నారు. ఆమెకు స్వామి మూడు ముఖాలు ఆరు చేతులతో ‘శ్రీదత్తదేవుని’ గా దర్శనమిచ్చినారు! ఆమె, అలా కనపడుతున్నారని చెప్పినది. “కన్నులు తుడుచుకొని బాగా చూచి చెప్పు ఇది భ్రమ కావచ్చును కదా” అన్నారు స్వామి. ఆమె అలాగే కన్నులు తుడుచుకొని మరల చూచి అలాగే కనపడుతున్నారని చెప్పినది. విశేషమేమంటే సీతమ్మగారికి విష్ణుముఖము మధ్యముగాను, సుబ్రహ్మణ్యంగారికి శివముఖం మధ్యంగాని, వల్లికి బ్రహ్మముఖం మధ్యంగాను మొత్తము మూడుసార్లు స్వామి ‘దత్తదర్శనము’ ఇచ్చినారు.

(మిగతా వచ్చేసంచికలో...)

# మేము మాగురుదేవులు

(చిలుకూరి బాలకృష్ణమూర్తి, భవాని)

ఆ రోజు గురువారము. తెల్లవారుఝామున నాలుగు గంటల సమయము. బ్రహ్మముహూర్త కాలము. స్వామి ప్రతిష్ఠించిన శ్రీ దత్తాత్రేయ పీఠము మీద విరాజిల్లుచున్న శ్రీ గురుదత్త భగవానుని చిత్రమునకు మేము దంపతులము ఇరువరము పూజ చేయుచున్నాము. మా వెనుక స్వామి, మా గురుదేవుల (శ్రీ దత్తస్వామి) ఆసీనులై ఉన్నారు. ఇంతలో హఠాత్తుగా స్వామి "చూడండి! చూడండి! శ్రీ దత్తభగవానుని కన్నుల నుండి ఆనందాశ్రుధారలు ఎలా ప్రవహించుచున్నవో" అని పలికినారు. మేము పూజించుచున్న శ్రీ దత్తుని పటము మీదకు దృష్టిని సారించినాము. స్వామి కనుకొలకుల నుండి రెండు కన్నీటిధారలు పటము మీదుగా ప్రవహించుచున్నవి. నేను తదేక దృష్టితో ఆ ధారలను చూచుచూ "అవును అవును" అని ఆనందముతో తన్మయుని అయ్యాను. రెప్పవాల్చకుండా నిశ్చేష్టుడనూ అలా చూస్తూ పరవశించి పోతున్నాను. ఇంతలో నా శ్రీమతి  ఆ కన్నీటి ధారలపై హస్తమును ఉంచినది. ఆ కన్నీటి ధారలపై హస్తమును ఉంచి "చూడండి ఎంత చల్లగా ఉన్నవో ఫ్రిజ్ నీటి వలే చాలా చల్లగయున్నవి" అని ఆశ్చర్యంతో ఆనందంతో, నవ్వుతూ నా వైపు తిరిగి చెప్పినది. అప్పుడు వెనుకనుండి మా గురుదేవులు (స్వామి) అవి ఆనందాశ్రువులు. అందుకే చల్లగా ఉన్నాయి. దు:ఖాశ్రువలయితే వేడిగా ఉంటాయి. మీ ఇరువురి ఆరాధనకు స్వామి సంతోషించి ఆనందాశ్రువలను రాలుస్తున్నారు అని తెలుసుకోండి, అని వచించారు. ఆ అశ్రుధారలపై హస్త స్పర్శ జరుగగనే ఆ అశ్రుధారలు కారుట ఆగినవి. ఆశ్రుధారల చారలు ఆ రోజంతా చిత్రపటము మీద ఉన్నవి. మా గురుదేవులు (శ్రీదత్తస్వామి) కాలేజీకి వెళ్ళవలసిన సమయము అయినందున వెంటనే లేచి దిగి వచ్చి కాలేజీకి వెడలిపోయినారు. ఈ మహిమ స్వామి మీద మేము వ్రాసిన మహిమయమున గ్రంథములో ఉదహరించబడలేదు. కారణమేమనగా దానిని ఏకారణము చేతనో మేము మరచిపోయినాము. ఆశ్చర్యమేమనగా స్వామి చేసిన మహిమలలో అదియే మొట్టమొదటి మహిమ. (మిగతాది వచ్చే సంచికలో.....)

# గురుపూర్ణిమ సందేశము (ఉదయము)

## దత్తస్వామి (స్వామి) దివ్య ప్రచనము

శ్రీమతి ఎస్.గాయత్రి & చంద్రశేఖర్, కువైట్.

ఈనాడు మీరు అందరును ఈ దివ్య దత్త జ్ఞాన-భక్తి ప్రచార సేవకై నా చరణముల వద్ద గురుదక్షిణలను సమర్పించినారు. గురుపూర్ణిమ నాటి పూర్ణ చంద్రబింబము బంగారము లేక వెండి నాణెమును అనగా ధనమును సూచించుచున్నది. ఇది నీవు గురువుకు సమర్పించవలసిన గురుదక్షిణలను గుర్తుచేయుచున్నది. ప్రతి నెలా గురుదక్షిణనీయవలెనని ప్రతిపూర్ణిమ నీకు చెప్పుచున్నది. గురువు నరుడు కారాదు. అతడు నరరూపమున వచ్చిన నారాయణుడగు సద్గురువు కావలెను. అప్పుడే నీ గురుదక్షిణకు సద్వినియోగము జరుగును. ధనమే నీ సత్య ప్రేమను నిరూపించుచున్నది. నీవు ధనమును ఎవరికి ఇచ్చుచున్నావు? నీ సంతానమునకు ఇచ్చుచున్నావు. కావున నీ నిజమైన ప్రేమ నీ సంతానముపైనే ఉన్నది. అదియే చక్కని నిజమైన పరీక్ష. నీకు భగవంతునిపై అట్టి నిజమైన ప్రేమ ఉన్నచో నీవు ధనమును భగవంతునకే ఇచ్చెదవు. దీనిలో ఇంక వాదము లేదు. ఇది క్రియాత్మకమైన పరీక్ష. మనస్సుతో ధ్యానము, నోటితో స్తోత్రము నీ అసత్యమైన దైవ ప్రేమను ఇతరులకు సత్యమని చూపించు వంచనయే. అయితే కంచములో అన్నము ఉన్నచో పక్కన ఉన్న ఊరగాయ ముక్కలవలె ఈ ధ్యాన, స్తోత్రములు గురుదక్షిణలకు పక్కనే చేరి ఉన్నచో సార్థకములగును. ఈ గురుదక్షిణలే కర్మఫలత్యాగము అని గీతలో అడుగడుగనా ఘోషించబడినది. కర్మయొక్క ఫలమును ఆశించక దానిని ఈశ్వరార్పణము చేయుటయే కర్మఫల త్యాగము లేక గురుదక్షిణ. గురుదక్షిణ లేని ధ్యాన స్తోత్రములు కేవలము ఊరగాయ ముక్కలు మాత్రమే ఉండి అన్నము వడ్డించని విస్తరి వలే ఉండును. గురుదక్షిణ సార్థకము అగుటకు సద్గురువును గుర్తించవలెను. "సత్యం, జ్ఞానం" అని వేదము సద్గురువును సత్యమైన, అనంతమైన జ్ఞానముచేత గుర్తించవలయును అని చెప్పుచున్నది. నాలుగు వేదముల మహావాక్యములలో మొదటి మూడు వాక్యములు పరమాత్మ నావలె, నీ వలె, వాని వలె మనుష్యాకారమున ఉండునని చెప్పుచున్నవి. నాలుగవ మహావాక్యము అట్టి నరావతారుడు ఎట్టి నరులు చెప్పలేని విశేష జ్ఞానముతో ఉండునని పలుకుచున్నది. పండితులు చెప్పు జ్ఞానము తల నొప్పిని కలిగించును. అవతరించిన సద్గురువు చెప్పు జ్ఞానము మాత్రమే హృదయములోనికి చొచ్చుకొని పోయి ఆనందమును కలిగించుచున్నది.

ఆనందము బ్రహ్మమని వేదవాక్య ప్రమాణము. వేడిచేత అగ్నిని గుర్తించినట్లు ఆనందప్రదమైన జ్ఞానము చేత సద్గురువును గుర్తించవలెను. మహిమలు గుర్తులు కావు. రావణుడు మొదలగు రాక్షసులు సైతము మహిమలను ప్రదర్శించెను. మొండి బిడ్డలగు ఈ రాక్షసులు తపస్సు అను మొండి పట్టుదలద్వారా స్వామికి సొమ్ములవలెనున్న ఈ మహిమలను స్వామి నుంచి పొందెదరు. వారు స్వామి నుండి జ్ఞాన గుణములను పొందలేరు. కావున వారు స్వామి కాలేరు. మహిమలచేత వారు దేవుడని ప్రకటించుకున్నను ఈ కారణమువలన ఋషులు అంగీకరించలేదు. ఈశావాస్య ఉపనిషత్తులలో మొదటి మంత్రము: "ఈ విశ్వమంతయు ఈశ్వర ధనము. నీకు అవసరమైన ధనమును మాత్రమే గ్రహించుటకు ఈశ్వరుడు అనుమతించియున్నాడు. దానికన్న ఎక్కువ తీసుకున్నచో స్వామికి తిరిగి ఇచ్చివేయమని" చెప్పుచున్నది.

గోపికలు తమ సర్వకర్మఫలమగు వెన్నను నరాకారమున ఉన్న కృష్ణునకు పెట్టి వారి పిల్లలకును పెట్టక అత్యుత్తమమైన గోలోకమును పొందినారు. ప్రారబ్ధ కర్మఫలమగు శరీరములను సైతము స్వామికి సమర్పించి ధర్మభంగమునకు,

నరకమునకునూ భయపడక సర్వార్పణ త్యాగమును చేసి అత్యుత్తమ స్థితిని పొందినారు. వారు గురుదక్షిణగా స్వామికి అర్పించనిది ఏమున్నది?

స్వామి గోపికలతో ఉన్నాడె తప్ప పురుషులతో కలసి ఏల ఉండలేదు? అని స్వామిని స్త్రీ లోలునిగా నిందించుచున్నారు. దీనిలోని రహస్యమేమి? పురుషుడు అహంకార రజోగుణములతో ఉండును. స్త్రీ ఎప్పుడునూ వినయము, భయము మొదలగు సాత్త్వికమైన మోక్షగుణములతో ఉండును. అందుకే ఋషులు గోపికలుగా జన్మించినారు. ఏ జీవుడైనా ముక్తికి ముందు కడపటిజన్మగా స్త్రీ జన్మను పొందవలసినదే. అయితే దీని అర్థము ప్రతి స్త్రీ జన్మ చివరి జన్మ అని కాదు.

కన్నప్ప అను కిరాతుడు దేహములో ప్రధానమైన కన్నులను స్వామికి సమర్పించినాడు. అది అత్యుత్తమ గురుదక్షిణ. నీకు నీ కుటుంబమునకు కావలిసిన ధనమును ఆర్జించుకొనుటకు స్వామి అనుమతించును. నీవు ఎక్కువ తీసుకొన్నచో దానిని స్వామికి ఇచ్చివేయమని వేదము బోధించుచున్నది. నీవు మిత్రుని ఇంటికి పోయినప్పుడు కప్పుతో పాలను ఇచ్చినాడు. పాలను త్రాగుము. కాని కప్పును దొంగిలించకుము. దొంగిలించినచో నీవు దొంగవు పాపివి అగుదువు అని వేదము చెప్పుచున్నది. ఆ ఎక్కువ పాప ధనము నిన్ను కష్టముల పాలు చేయుచును. కొందరు భక్తులు వారి కనీస ధనమును కూడా మొత్తము లేక కొంత స్వామికి సమర్పించుచున్నారు. పాటిల్ పండించిన సంవత్సర ధాన్యమంతయు షిరిడీ సాయిబాబాకు తెచ్చి ఇచ్చి ఆయన ప్రసాదించినది తీసుకొని పోయెడివాడు. ఒక ధనికుడు బ్రహ్మ జ్ఞానమీయమని సాయిని వెంటబడగా సాయి నాకు కావలసిన ఐదు రూపాయలను నీ జేబు నుండి తీసి ఇవ్వలేనివాడవు నీవు బ్రహ్మమును ఎట్లు తెలుసుకొందువు? అని చెప్పినాడు. ఈ కర్మఫలత్యాగమును నేర్పుటకే సాయి అందరినీ గురుదక్షిణ అడిగెడివాడు.

అసలు స్వామికి నీ ధనము అక్కరలేదు. నీవు తీసుకొన్న పెచ్చు ధనమును ఇచ్చటనే వదలి ఆ పాపముతో ఒక్కడవే పైకి పోవుచున్నావు. ఈ విశ్వమంతయును స్వామి ధనాగారమే. ఆయన ధనాగారములోనే నీవు తీసుకొనుట, అనుభవించుట, వదలివేయుటయు జరుగుచున్నది. నీవు దొంగిలించిన హెచ్చు ధనము నీ చేతులతో స్వామికి సమర్పించని పాపమును మాత్రమే మూటగట్టుకుని ఆ హెచ్చుధనమును ఇచ్చటనే వదలిపోవుచున్నావు.

శబరి శ్రీరామునికి ఆమె ఆహారమగు రేగిపండ్లను సమర్పించినది. తిన్నడు వేటాడి తెచ్చిన పచ్చిమాంసమగు పాపధనమును శివునికి సమర్పించినాడు. శివుడే విష్ణువని వేదము. కావున ఇరువురు ఒక్కరినే చేరినారు. ఇరువురిలోను భక్తి తీవ్రత సమానముగ ఉన్నది. నీవు పాపధనమును సైతము గురుదక్షిణగా స్వామికి ఇచ్చినచో నీ పాపము లెక్కింపబడుటలేదు. పాపముతో సంపాదించిన వేట మాంసము తాను తినక స్వామికి అర్పించిన తిన్నడు ముక్తుడైనాడు. తాను భుజించిన, పాపమును పొందును.

తిరుపతిలో స్వామికి నీ కష్టములో సాయము లభించిన తరువాత ధనమును గురుదక్షిణగా ఇచ్చుచున్నావు. ఆ ధనము స్వామిదే. నీవు దొంగిలించిన పెచ్చుధనమే దానిని క్షమాపణ కోరుచూ వాపసు చేయుటకు బదులు దానితో స్వామితో పనిచేయించుచున్నావు. పని చేసిన తరువాతనే డబ్బు ఇచ్చుట! నీ విశ్వాసము ఇది! నాస్తికులు కూడా డబ్బు ఇచ్చి ఇతరుల చేత పని చేయించుచున్నారు. వారి కన్న నీవు ఏమి ఎక్కువ? ఆ స్వామిలో వేషధారిగా ఉన్న గురుదత్తుడు ఈ రోజు మీరు దిద్దుకొనుటకై సత్య జ్ఞానమును బోధించుచున్నాడు.

ఈనాడు గురుదత్తుడు స్వామి ధనమునుండి దొంగిలించిన పెచ్చుధనమును స్వామికి గురుదక్షిణగా సమర్పించి నీ పాపముల గొలుసునుండి విముక్తిని పొందవలెనని బోధించుచున్నాడు. నీవు ఒక దుకాణము నుండి దొంగిలించిన ధనమును ఇచ్చివేయవలెను. కాని దానితో ఏ వస్తువును దుకాణములో కొనరాదు. నీవు క్షమాపణ చెప్పి ఇంటికి పోయినచో దత్తుడు ప్రసన్నుడై నీ ఇంటిలో వంద వస్తువులు ఉండునట్లు చేయును. పాలుతాగి దొంగిలించిన కప్పను ఆ కప్పయొక్క యజమానికే ఇచ్చివేయవలెను. అలాగే స్వామికే సమర్పించవలెను. ఇదే గురుదక్షిణ. దీనిని సమర్పించినప్పుడు క్షమాపణ, భయము ఉండవలెను. కాని గర్వము ఉండరాదు. ''భియాదేయం'' అని వేదము. అనగా భయముతో స్వామికి ఇమ్మని అర్థము. ''సంవిదాదేయం'' అని వేదము. అనగా జ్ఞానముతో స్వామికి ఇమ్మని అర్థము. అనగా జ్ఞానము అను గుర్తుతో స్వామిని గుర్తించమని అర్థము. ''శ్రద్ధయాదేవం'' అని వేదము. అనగా స్వామిని గుర్తించువరకు ఓర్పుతో వేచిఉండమని అర్థము. దీని అర్థము కప్పను దాని యజమానికే ఇచ్చునట్లు సమస్త ధనమునకు యజమానియగు స్వామికే నీవు దొంగిలించిన ధనమును గురుదక్షిణగా ఇమ్మని అర్థము.

దానములో తొందర పనికిరాదు. సద్గురువు లభించువరకు ఓర్పుతో నీ ధనమును కూడబెట్టుకొనుచూ లభించగానే మొత్తమును గురుదక్షిణగా ఇమ్ము. ఆరోజే నిజమైన గురుపూర్ణిమ. ప్రతిరాత్రి  ఒక్కొక్క కళతో చంద్రబింబము ఈనాటికి పూర్తి అగునట్లు నీవు కూడబెట్టిన ధనముతో నీ హుండి పూర్తి కావలయును. దానములో దేశము, కాలము, పాత్ర అను మూడు అంగములు ఉండును. పాత్ర చాలా ముఖ్యము. గురుపూర్ణిమ (కాలము) రోజు, కాశి (దేశము)లో దానము చేయుట ముఖ్యము కాదు. యోగ్యునకు (పాత్ర) దానము చేయుట ముఖ్యము. ఆ పాత్ర సద్గురువు అవునా? కాదా? అని నీవు విచారించుట లేదు. సద్గురువగు గురుదత్తుడు లభించినప్పుడు నీవు కూడబెట్టిన ధనమును గురుదక్షిణగా అర్పించిన ప్రదేశమే కాశి. ఆ రోజే నిజమైన గురుపూర్ణిమ.

సద్గురువు లభించనిచో దీనుడైన దత్తభక్తునకు దానము చేయము. నారద భక్తి సూత్రము ''తన్మయాహితే'' ప్రకారముగా స్వామి అవతార పురుషునిలోనే కాక భక్తులలోను ఉన్నాడు. అయితే భక్తులలోను ఉన్నాడు. అయితే భక్తులలో స్వామి బోధించినది ఆ జీవుడు బోధించి ఆచరిస్తాడు. అప్పుడు దోషములు రావచ్చును. ఉదాహరణకు నీవు ఒక భక్త సమాజమునకు గురుదక్షిణ ఇచ్చితివి. దానితో వారు శివరాత్రినాడు కాశీలో వంద మందికి అన్న దానమును చేస్తారు. అయితే సద్గురువు, పాత్రుడైన ఒకనికి వంద రోజులు అన్న దానమును చేసి నీ గురుదక్షిణను పూర్ణ ఫలమిచ్చును. సద్గురువు విషయములో శరీరములో స్వామి ఒక్కరే ఉంటారు. కావున ఆయన బోధలో కాని, పనిలో కాని ఏ దోషము రాదు. షిరిడీసాయి వచ్చిన గురుదక్షిణలను బీద భక్తులకు ఇచ్చేవారు. సర్వజ్ఞుడగు ఆయనను ఎవరు మోసగించలేరు. బిచ్చగాళ్ళు నిన్ను మోసగించగలరు.

గురుదక్షిణలను ఇచ్చిన తరువాత దానిని సద్గురువు ఏమి చేయునని పరీక్షించరాదు. పూర్ణ విశ్వాసముతో ఇయ్యవలెను. ఆయనను సద్గురువుగా నిశ్చయించిన తరువాత మరల పరీక్ష ఏల? అగ్ని అని నిశ్చయించిన తరువాత దానలో మరల వేలు పెట్టి పరీక్షించరాదు. నీ విశ్వాసము పూర్ణము కానిచో కోతి పిల్ల తన తల్లి పొట్టను పట్టుకొన్నట్లు ఉండును. ఒక స్థలము నుండి మరియొక్క స్థలమునకు తీసుకొనిపోవు బాధ్యత మాత్రమే తల్లిది. పట్టు బాధ్యత పిల్లది. కావున పడిపోవచ్చును. ఇదే మర్కట కిశోర న్యాయము. విశ్వాసము సంపూర్ణమైనచో మార్జాల కిశోర న్యాయముగా పిల్లి తన పిల్లను నోట కరుచుకొని తీసుకొని పోవును. సాయిబాబా గురుదక్షిణ ఖర్చు గురించి ఏ ఒక్కరు సాయిబాబాను ప్రశ్నించలేదు. ఒక ఇన్

కంటాక్స్ అధికారి ప్రయత్నించి విఫలుడయ్యెను. కటిక పేదవాడగు మహల్సాపతికి సాయి ఏమియును ఇచ్చుట లేదని భక్తులు బాధపడినారు. సాయి మహల్సాపతియొక్క స్థిర భక్తిని పరీక్షించుచున్నాడని భక్తులకు తెలియదు. సాయము చేసినచో ఆ పరీక్ష పాడగును. పరీక్ష లేకున్నను నీ స్థితి స్వామికి తెలియును. కాని మీరు చాలా గొప్ప స్థితిలో ఉన్నట్లు ఊహాలోకమున విహరించుచున్నారు. స్వామి బోధించిననూ నమ్ముటలేదు. పరీక్షలలో నిరూపింపబడినకాని నమ్మరు. కావున దత్తపరీక్షలు నీశ్రేయస్సుకే కాని సర్వజ్ఞుడగు స్వామికొరకు కాదు. ఈ పూర్ణిమ చంద్రుడును మీరు కూడబెట్టిన ధనమునే కాదు, దానిని గురుదక్షిణగా ఇచ్చినప్పుడు మీకు ఉండవలసిన పూర్ణ విశ్వాసరూపమగు మనస్సును సూచించున్నాడు. చంద్రుడు ధనమును, మనస్సును  కూడా సూచించున్నాడు. ''చంద్రాంహిరణ్మయీం'', ''చంద్ర మామననో'' అని చెప్పుచున్నది. సాయి తనకు దక్షిణలను ఇచ్చువానిని నేరుగా తాను ఈయదలచుకున్నవారికి ఇప్పించి ఉండవచ్చును కదా! వీటిని తీసుకుని ఆయన రహస్యముగా పంచెడివాడు. అట్లు చేయుట ద్వారా తనకు గురుదక్షిణలను ఇచ్చిన వారి యొక్క పూర్ణ విశ్వాసమును పరీక్షించెడివాడు.

## గురుపూర్ణిమ సాయంకాల దివ్యప్రవచనము

ప్రపంచములో ప్రతి మతము నీ దుర్గుణములను పూర్తిగా పోగొట్టుకున్నకాని ఆ మతములో చేరుటకు పనికిరావని చెప్పుచున్నది. ఇది ఆచరణలో అసాధ్యమగుచున్నది. ఏలననగా ఈ దుర్గుణములు అనేక పూర్వ సంస్కారమ పర్వతములు. ఈ స్వల్ప మానవ జన్మ వీటిని కదలించుటకు సైతము చాలదు. ప్రయత్నముచేత కొంతవరకు వాటిని నిగ్రహించవచ్చును. ఈ దుర్గుణములు ఋషుల మనస్సులలో కూడా నిప్పురవ్వలవలే మెరయుచున్నవి. ఎవరైననూ తనలో ఏ దుర్గుణము లేదని చెప్పినచో అది పరవంచన మరియు ఆత్మవంచనయే. ఇట్టి అసాధ్యమైన పనిని ప్రతి మతము కోరుచున్నందున అందరికి ఈ మతములపై ప్రీతి నశించుచున్నది. మత ప్రవక్తలు మతమును ఆధ్యాత్మికమును కలిపి గందరగోళము చేసినారు. మతము విశ్వములో శాంతి ధర్మములను స్థాపించుట. నీ దుర్గుణములు సజ్జనులను బాధించి, విశ్వశాంతికి భంగము కలిగించినచో స్వామి నిన్ను శిక్షించును. కావున పూర్తిగా తీసివేయుటకు సాధ్యము కాని నీ దుర్గుణములను కొంత నిగ్రహించుకొనుము. దీనితో మతము ఆగిపోవుచున్నది. కొన్ని మతములు ఇంతటితో ముగిసి, తరువాత భాగమగు ఆధ్యాత్మికమును అసలు బోధించుట లేదు.

ఇక ఆధ్యాత్మికము అనగా స్వామిని చేరుటకు చేయు సాధన. దీనిలో దుర్గుణములను నిగ్రహించవలసిన అవసరము కూడా లేదు. స్వామికి నీ దుర్గుణములను గురించి ఎట్టి ఆక్షేపణము లేదు. అవి సాధనకు అడ్డురావు. అంతేకాదు వీటిని స్వామి వైపు మరలించినచో అవి నీకు సాధనలో సాయపడును. సాధనలో సాయపడుటకే అన్ని గుణములను స్వామి సృష్టించినాడు. కావున గుణములను సృష్టించుటలో కల అసలు ముఖ్యోద్దేశము గ్రహించినచో నీకు సాయపడుచున్న ఏ గుణమునైననూ నిగ్రహించరాదు. ఎంతటి మూర్ఖుడైననూ సాయపడువానిని అడ్డుకొనడు. కావున ఏ గుణమైననూ సాధనలో సాయపడునప్పుడు సద్గుణమే అగును. అట్లు కానిచో దుర్గుణములగును. కావున ప్రపంచమువైపుకు మరలింపబడిన ఏ గుణమైననూ దుర్గుణమే. సాధనలో భక్తిని సంపాదించుటకు ప్రయత్నము చేయవలెను. కాని గుణములను నిగ్రహించుటకు, తొలగించుటకు కాదు. భక్తి, జ్ఞానము చేత లభించి వృద్ధి పొందును. బొంబాయి నగరము ఉన్నది అని తెలియగనె చూడగోరుదుము. కాని దాని విశేషములు ఇంకను తెలియు కొలదీ దానిని చూచు కోరిక వృద్ధి

అగును. కావున జ్ఞానము పెరిగిన కొలదీ కోరిక లేక భక్తి పెరుగుచున్నది. కృష్ణుడు భూమిపై అవతరించి ఉన్నాడని రుక్మిణి ముందు తెలుసుకున్నది. నారదుని నుండి ఆ కృష్ణుని గురించిన విశేషములను మరీ మరీ తెలుసుకున్నకొలదీ కృష్ణునిపై ప్రేమ అపారముగ వృద్ధి చెందినది. నారదుడు అనగా జ్ఞానమును ఇచ్చువాడు అని అర్థము. భక్తిచే భగవంతుడు లభించునని ''భక్త్యాత్వనన్యయా'' అని గీత చెప్పుచున్నది.

కావున దత్త మతములోనికి ప్రవేశించుటకు అర్హత: నీవు ఒక ప్రాణివై ఉన్నచో చాలును. ఎట్టి గుణములు ఉన్ననూ మృగములు సైతము దైవ ప్రేమల ద్వారా దైవమును చేరవచ్చును. ఏనుగు, సాలీడు, సర్పము కూడా శ్రీకాళహస్తిలో ముక్తిని పొందినవి. సర్పము చాలా దుష్టప్రాణి. దీని దుర్గుణములను వదులుకొమ్మని స్వామి దానికి బోధించలేదు. బోధించిననూ దానికి అర్థము కాదు. అట్టి సర్పమునకే మోక్ష అర్హత ఉన్నప్పుడు ఒక దుష్ట మానవునకు ఏల అర్హత లేదు. మతములు విధించు ప్రవేశ అర్హతలో మానవులు నిరుత్సాహమును పొందిఉన్నారు. తల తెంచుకున్నకాని ప్రవేశార్హత లేదని ఒక సంస్థ చెప్పినచో ఆ సంస్థ లోనికి ఎవరు చేరగలరు? అట్లే మతములు దుర్గుణములను తొలగించుకొనుట అన్నది విధించినచో ఎవరికిని సాధ్యముకాదు. కాకున్న, లోకశాంతికి భంగము రాకుండా నిగ్రహించుకొన వచ్చును. అట్టి నిగ్రహము దత్తమతములో కూడా విధించబడియే ఉన్నది. కావున దత్తమతములో లోకశాంతి కొరకు నీ దుర్గుణములను నిగ్రహించుకొన్నచో, స్వామిని చేరు సాధనలో మాత్రము అవి అడ్డు కానందున, మరియు సాయపడుటవలన, సాధనలో వాటి నిగ్రహము కూడా అవసరములేదు.

సాధనలో సాయపడునట్లు దుర్గుణములను స్వామి వైపుకు ఎట్లు మరల్చవలయును? ప్రతి జీవునిలో కోట్ల జన్మల నుండి పేరుకుపోయిన ఆరు దుర్గుణములు ఉన్నవి. అవి కామ, క్రోధ, లోభ, మద, మోహ, మాత్సర్యములు. ఇందులో క్రోధ, లోభ, మద, మాత్సర్యములు రజో గుణములు. కామ, మోహ ములు తమో గుణములు. స్వామి వైపుకు దుర్గుణములను మరలించు విషయములో ఒక చిన్న ఉదాహరణ: సినిమా పాటలలో ఉన్న ప్రేమను ఆ పాటలలో చిన్న మార్పుల ద్వారా స్వామి వైపుకు మరలించ వచ్చును. ఆ పాటలలో ఉన్న మధురమైన శక్తి వంతమైన లయ, రాగములు నిన్ను స్వామి వద్దకు తీసుకొని పోవు వాహనములుగా మారుచున్నవి. ''చురాలియా హై తుమ్నే...'' అను సినిమా పాటను తీసుకొని సనమ్ అను శబ్దమునకు బదులు హరే శబ్దమును పెట్టుము. ఇప్పుడు నీ ప్రేమ మాధుర్యము అంతయును విష్ణువగు కృష్ణునిపై కేంద్రీకరించబడి ఉన్నది! చూచితిరా! ఒక సినిమా పిచ్చివాడు తన దుర్గుణములలో ఎట్టి మార్పులను చేయనవసరము లేకయే మహాభక్తునిగా మారినాడు. ఈ పాటను వాడు ప్రార్థనగా పాడుచున్నప్పుడు ఎట్టి బలవంతము లేక పాడును. బలవంతము లేని సహజమైన ఆరాధనయే సత్యము.

బిల్వాణుడు అను కవి ప్రియురాలి మైకములో పోవుచుండగా దారిలో ఉన్న ఒక ఋషికి తన కాలు తగిలినది. ఋషి ఆగ్రహించినాడు. అప్పుడు బిల్వాణుడు ఇట్లు అడిగినాడు: ''ప్రియురాలి మైకములో ఉన్న నాకు, నా కాలు నిన్ను తగిలినట్లు తెలియలేదు. భగవంతుని మైకములో ఉన్న నీకు ఎట్లు తెలిసినది?'' అప్పుడు ఋషి సంతసించి ఇట్లు చెప్పినాడు. '' నీ ధ్యానము అద్భుతము. కాని నీ లక్ష్యము మంచిది కాదు. నీ ప్రియురాలి స్థానములో కృష్ణుని ఉంచుకొన్నచో నా కన్న ముందు నీవు స్వామిని చేరుదువు''. ఆ క్షణమునుండి బిల్వాణుడు కృష్ణ భక్తునిగా మారి సంన్యాసి అయినాడు.

జ్ఞానము, కరుణ మెదలగు గుణములు సత్త్వగుణములు. అనగా సద్గుణములు. రజస్సు, తమస్సు అనునవి దుర్గుణములు. రుక్మిణి సత్త్వగుణము. సత్యభామ రజోగుణము. రాధ తమో గుణము. గుణముల వరకు చూచుకొన్నచో

ఒకదాని కన్న మరియొకటి ఎక్కువ. కాని ఆ ముగ్గురిలో ఉన్న భక్తి తీవ్రతను చూచినచో రుక్మిణికన్న సత్యభామ, సత్యభామ కన్న రాధకు ఎక్కువ ఉన్నది. కావున మహాలక్ష్మి స్వరూపిణియగు రుక్మిణికి హృదయ స్థానమును, దానికన్న పై స్థాయి అగు మూతిపై వరాహఅవతారమున భూదేవి అగు సత్యభామకు స్థానమును, దాని కన్న పై స్థానముగా గోలోకమున తన తలపై రాధకు స్థానమును ఇచ్చినాడు. స్వామి భక్తికి విలువను ఇచ్చినాడే కాని గుణములకు కాదు. కామమును స్వామి సౌందర్యముపై అట్లే మోహమును స్వామి ప్రవర్తన ఎట్లు ఉన్ననూ స్వామి మీదనే ఉంచుము. మోహము అనగా గుడ్డి ఆకర్షణ. ఈ రెండు దుర్గుణములను పాత్రలలో రాధ తన ప్రేమను పోసినది. ఇక సాక్షాత్కరించలేదని కోపమును స్వామిపై చూపుము. సంసారమునకు కాలమును, శక్తిని వ్యయము చేయక దాచుటలో లోభివి కమ్ము. అవసరములకు కూడా ఖర్చు పెట్టని మహాలోభి గుణము కర్తవ్యయములకు సైతము కాలశక్తులను ఖర్చు చేయని మహాభక్తిగా మలచవలయును. ''స్వామి భక్తుడను నాకేమి?'' అను ధైర్యములో మదమును మలచవలయును. మహాభక్తులను చూచి మాత్సర్యము పొంది నీ భక్తిని పెంచుకొనవచ్చును. ఈ నాలుగు దుర్గుణములను పాత్రలలో దైవప్రేమను సత్యభామ పోసినది.

''మానవ సేవయే మాధవ సేవ'' – సరియైన అర్థము.

''మానవ సేవయే మాధవ సేవ'' అను వాక్యము సరిగా అర్థము చేసుకొననిచో చాలా ప్రమాదకరము. అన్నము, వస్త్రము, ఔషధములను ఆర్తిలకు ఇచ్చుటయే సేవ కాదు. ఆర్తుడు స్వామిచే విధించబడిన తన పూర్వపాప శిక్షలను అనుభవించుచున్నాడు. నీవు వాని పూర్వ పాపములను చూడలేదు. ఇప్పడు శిక్షలను చూచి కరుణించుచున్నావు. నీవు వానికి శాశ్వత సహాయమును చేయలేవు. వానికి జ్ఞానము, భక్తిని దానము చేసి భక్తునిగా మార్చినచో వానికి భగవంతుడే శాశ్వత సహాయము చేయును. కావున అన్నాది దానమే సేవ కాదు. నీ అన్నమును భుజించినవాడు పాపములను మరల చేసినచో ఆ పాప భాగమును నీవు పొందెదవు. నీవు వానికి అన్నాదులతో పాటు జ్ఞానమును, భక్తిని కూడా దానము చేసినచో అట్టి కార్యము దైవ కార్యము కావున నీవు చేసినది మానవ సేవయే. ధనవంతులకును జ్ఞానము, భక్తిని దానము చేయుము. దారిద్ర్యము అనగా డబ్బు లేకపోవుటయే కాదు. జ్ఞానము, భక్తి లేక పోవుట కూడా. అన్న దానము ఈ దేహముతో నశించుచున్నది. జ్ఞానము, భక్తి లేనిచో జీవుడు శాశ్వతముగా పశు-పక్షి జన్మలయందు పడుచున్నాడు.

ఈ వాక్యము యొక్క అసలు అర్థము వేరు. మానవుడు మాధవునిగా అవతరించినప్పడు మానవునిగా కనిపించును. అట్టి వానిని ఆయన స్వభావమైన ఆనందప్రదమైన జ్ఞానము చేత గుర్తించి ఆయనను సేవించినచో అట్టి ఆ మానవుని సేవ మాధవ సేవ అగునని అర్థము. స్వామి కృష్ణునిగా అవతరించినప్పడు ఆయనను కొందరు మానవునిగా, మరికొందరు మాధవునిగా భావించినారు. కావున ఇది ఒక క్లిష్ట సమస్య అయినది. కరెంటు, లోహపు తీగను వ్యాపించినట్లు మాధవుడు ఆ మానవ శరీరమును వ్యాపించినాడు. కరెంటు, తీగవలె మానవుడు, మాధవుడు ఇద్దరు ఉన్నారు. ఈ సమస్యను శంకరాచార్యులు చర్చించి ఇద్దరూ ఉన్ననూ ఒక్కరే ఉన్నట్లు గ్రహించవలయునని అద్వైత సిద్ధాంతమును చేసినారు. కరెంటు, తీగ రెండూ ఉన్ననూ తీగను ఎచ్చట తగిలిననూ కరెంటు షాకు కొట్టుచున్నది. కావున తీగయే కరెంటు. ఈ విధముగా అవతరించిన మానవ శరీరమే మాధవుడు. కృష్ణుని స్పృశించినచో పరమాత్మను స్పృశించినట్లే. కాని ఈ సిద్ధాంతమును మానవులు వక్రముగా సర్వ మానవులకు విస్తరించి మానవుడే మాధవుడు అన్నారు. అందుకే శంకరులు కరిగిన సీసమును తాగి శిష్యులను కూడా తాగమని సత్యమును బోధించినారు. అనగా శంకరులే దైవము. కాని శిష్యులు

కారని నిరూపించినారు. ప్రతి మానవుడు మాధవుడైనచో ఇంక ఈ సాధన ఎందులకు? అనగా మాధవునకు మోక్షము కావలయునా? ప్రహ్లాదుడు తన తండ్రిని కూడా మాధవునిగా ఏల అంగీకరించలేదు? నరసింహుడు హిరణ్యకశిపుడు ఇరువురును మాధవులే అయినచో నరసింహుడు హిరణ్యకశిపుని చంపినప్పుడు మాధవుని చంపినందున మాధవుడు ఆత్మహత్య చేసుకున్నాడా?

దేవదేవుడైన దత్తుడు పవిత్ర సద్గుణవంతుడైన పండితునిగా దర్శనమిచ్చును. ఒక్కొక్క సారి మద్యపాన వేశ్యాలోలునిగా దర్శనమిచ్చును. దీని ద్వారా స్వామి సద్గుణవంతులు కాని దుర్గుణవంతులు కాని తనను చేరవచ్చునని సూచించుచున్నాడు. బ్రహ్మ రజో గుణము. విష్ణువు సత్త్వగుణము. శివుడు తమో గుణము. ఈ త్రిమూర్తుల ముఖములతో ఉన్న పరమాత్మ సర్వ గుణములతో చేరి ఉన్నాడని అర్థము. సగుణ బ్రహ్మము అనగా అన్ని గుణములతో చేరి ఉన్న బ్రహ్మము అని అర్థము. ఈ త్రిగుణములలో ఉన్న రజస్సు, తమస్సు దుర్గుణములు. అనగా ఎక్కువ (2/3 వంతు) దుర్గుణవంతులే అని తెలియుచున్నది. విష్ణువు సత్త్వ గుణము కావున వైష్ణవులు విష్ణువును అత్యధికునిగా తలచుచున్నారు. వీరు బ్రహ్మను తక్కువ గాను, శివుని రాక్షస దైవముగాను నిందించుచున్నారు. ఈ త్రిగుణములు అనగా త్రిమూర్తులు స్వామి యొక్క మూడు రంగు వేషములే. స్వామి ఈ మూడు గుణములచేతను అంటబడుట లేదు. వేదము విష్ణువే బ్రహ్మ, విష్ణువే శివుడని చెప్పుచున్నది. వేషధారియొక్క రంగు వేషములయొక్క రంగుల చేత మారుట లేదు. సత్త్వము తెలుపు, రజస్సు ఎరుపు, తమస్సు నలుపు. కావున విష్ణువు తెల్లగాను, శివుడు నల్లగాను ఉండవలయును. కాని వారి ఇరువురి రంగులు మారినవి. విష్ణువు నల్లగాను, శివుడు తెల్లగాను గాను ఉన్నారు. శివుడు సత్త్వగుణములతో శాంతముగా ధ్యానములో ఉన్నాడు. విష్ణువు తమోగుణముతో గోపికలతో క్రీడించుచున్నాడు. ఇప్పుడు చెప్పుము. ఎవరు గొప్ప? కావున త్రిమూర్తులలో ఉన్న దేవుడు ఒక్కడే. అతడే దత్తుడు. అతడు ఏ గుణములచేతను అంటబడడు. నిర్గుణ బ్రహ్మము అనబడుచున్నాడు. వస్త్రముల రంగుల వలన ఏ రంగూ లేని స్వామి ఎర్రగా, తెల్లగా, నల్లగా కనబడుచున్నాడు. ఈ దత్తస్వరూపము ద్వారా త్రిగుణములలో ఉన్న భక్తి గుణములచేత అంటబడదు అని చెప్పుచున్నది. భక్తి గుణముయొక్క రంగును కలిగినట్లుగా కనిపించుచున్నది. కాని భక్తి ఏ రంగూ లేక నిర్మలమైనది. అనగా సద్గుణవంతుడైననూ, దుర్గుణవంతుడైననూ మంచి మార్గము, లేక చెడు మార్గమున కాని భగవంతుని చేరవచ్చును. భక్తుని లోను మార్గములోను భక్తి ఉన్నప్పుడు అది ఏ గుణములను అంటని మహాశక్తి స్వరూపముగా ఉండును. తమోగుణములతో శివుడు తామసునిగా రాక్షసులను సైతము చెడు మార్గమున కూడా తనను చేరవచ్చునని సూచించుచున్నాడు. అట్లే సత్త్వగుణమగు విష్ణువు మంచివారుగా దేవతలు తనను సన్మార్గమున చేరవచ్చునని సూచించుచున్నాడు. అయితే విష్ణువే శివుడని మరచిపోకుము. రాక్షసులైనా, దేవతలైనా భక్తి సమానముగా ఉన్నచో ఒకే భగవంతుని చేరుచున్నారు. లోకశాంతికి భంగము కలిగించిన కారణమునకే స్వామి రాక్షసులను శిక్షించినాడు. స్వామి మూడు ముఖములు విశ్వముయొక్క సృష్టి, స్థితి, లయములను సూచించుచున్నవి. మూడు పనులను ఒకే ముఖము చేయుచున్నది అని వేదము చెప్పుచున్నది. కావున దత్తుడు పరబ్రహ్మము. త్రిమూర్తుల అవతారములగు మధ్వ, రామానుజ, శంకరులే గురుత్రయము. అనగా ఈ గురుత్రయమే గురుదత్తుడు. ఈ గురుత్రయము యొక్క మూడు భాష్యములలో ఉన్న ఏక సిద్ధాంతమే శ్రీదత్తవాణి. దత్త భక్తి, ప్రతిఫలమును కోరక సత్యముగా, నిర్మలముగా ఉండవలయును. బిచ్చగాడు నీ దగ్గరకు వచ్చి నిన్ను పొగుడుచున్నాడు. నీవు వానిని పొమ్మనుచున్నావు. కాని నీ అతిథికి సర్వ సపర్యలను చేయుచున్నావు. ఇరువురిలో తేడా ఏమి? బిచ్చగాడు అన్నమును ఆశించి నీ వద్దకు

వచ్చినాడు. అతిథి కేవలము నిన్ను చూచిపోవుటకు వచ్చినాడు. ఇరువురి లక్ష్యములు వేరు కావున వానిపై చూపబడిన నీ ప్రవర్తన కూడా వేరువేరగా ఉన్నది. కావున దత్తుని వద్దకు అతిథిగా రమ్ము. నీవు ఏ ప్రతిఫలమును ఆశించక దత్తుని వద్దకు వచ్చినచో అతిథికివలె నీకు దత్తుడు సర్వమునూ ఇచ్చును.

దత్త మతములోనికి ప్రవేశించిన తరువాత సాక్షాత్తు దత్తుడే నీకు జ్ఞానమును బోధించును. జ్ఞానము ద్వారా భక్తి కలిగి ఆ భక్తి నిస్స్వార్థమై కర్మఫలత్యాగముచే నిరూపితమైనచో దత్తకైవల్యము లభించును. ఈ మతములో ప్రత్యేకత ఏమనగా నీవు బ్రతికి ఉండగానే దత్తుడు నీలో లీనమై పోవును. అసలు దత్తుడు అనగా తనను తాను నీకు దత్తము చేసుకొన్న వాడని అర్థము. దత్తమతము సముద్రము వలె ప్రత్యేకముగా ఉన్ననూ ఇతర మతములను నదులలో ఉన్న జలమే. నదులన్నియును సముద్రములో చేరవలసినదే. దత్త దిగంబరుడు అనగా అన్ని పాత్రల వేషములు తీసి తన సహజమైన వేషములో ఉన్నవాడని అర్థము. అవధూత దత్త అనగా దత్తుని రుచి చూసినచో సమస్త జీవులతో మరియు సమస్త వస్తువులతో ఉన్న నీ బంధములన్నియు తెగి విసిరి వేయబడునని అర్థము. దత్తుడనిగా తన భక్తులయొక్క పాప ఫలములను అనుభవించుటకు ఒక మనుష్య శరీరమును ఆశ్రయించి తనను తాను భక్తునకు దానము చేసుకొన్నవాడని అర్థము. నీకు జరిమానా విధించినప్పుడు నీ ఆత్మీయుడగు నీ తండ్రి తాను కట్టి నిన్ను విడిపించును. పాపఫలములను నిజముగా అనుభవించవలయును. కావున దత్తుడు మనుష్య శరీరములను గ్రహించును. ఈ శిక్షను అనుభవించునప్పుడు తన శక్తిని ఉపయోగించి దత్తుడు బాధనుండి తప్పించుకొనడు. అట్లు తప్పించుకొన్నచో దత్తుడు ధర్మదేవుని మోసగించినట్లు అగును. కావున దత్తుడు ఆశ్రయించిన మనుష్య శరీరము బాధలను నిజముగా అనుభవించుటకై ప్రకృతి నియములను అనుసరించి ఉండును. ఈ అనుభవము నిరంతరము ఉండును. కావున స్వామియొక్క శరీరము త్వరగా దెబ్బ తినుచున్నది. ఆయన దివ్య దర్శనములను ఇచ్చినప్పుడు మహావిద్యుచ్ఛక్తి ఆ శరీరమునో ప్రవహించును. దాని వలన ఆ శరీరము మరింత దెబ్బ తినుచున్నది. నీవు కొద్ది కర్మఫలమునే అనుభవించవలెను. ఆయన అనేక భక్తుల కర్మలను అనేక జన్మలనుండి అనుభవించుచున్నాడు. నీవు బాధతో విలపించవచ్చును. కాని ఆయన నవ్వుచుండవలెను. భక్త కర్మఫలములను అనుభవించుట ఒక్క క్షణము ఆపిననూ ఆ క్షణములో ఆయన దత్తుడు కాదు. నీవు సింహాసనమును చూచుచున్నావే కాని ముళ్ళను చూచుటలేదు. దత్తుడనగా ఆచరణము. బ్రహ్మము అనగా అఖండానంద స్వరూపమైన భావము. బ్రహ్మము కాగానే దత్తుడు కావలసిందే. అద్వైతులు బ్రహ్మమును గురించి తెలిసిన వారు. కానీ వారు దత్తుని గురించి తెలుసుకొన్నచో దత్తసేవకులుగనే ద్వైతములో ఉందురు. చూపులకు, స్పర్శకు సంభాషించుటకు కలసి మెలసి జీవించుటకు వీలుకాని పరమాత్మ వాటిని భక్తులకు అందచేయుటకు మనుష్యాకారమున తనను తాను భక్తులకు అందచేసుకున్న వాడే దత్తుడు. దత్త మతములో ప్రవేశించుటకు కావలసిన అర్హత అగు ''ప్రాణిగా పుట్టుటను'' ప్రతి మానవుడు కలిగియే ఉన్నాడు. ఇతర మతములలో విధించబడిన ప్రవేశార్హత అగు ''దుర్గుణములను వదలించుకొనుట'' ఏ మానవుడును ఇంతవరకు చేయలేదు. ఇది అసాధ్యము. కావున ఎన్నటికిని చేయలేరు. దీని అర్థము ప్రతి మానవుడునూ దత్తమతములోనికి పుట్టగానే ప్రవేశించియున్నాడు. మరియు ఇతర మతములలోనికి ఎన్నటికినీ ప్రవేశించలేడు. నీవు నిజముగా ఏ మతములో ఉన్నావో అట్టి విశ్వమతముయొక్క పేరును నీకు జ్ఞాపకము చేయుచున్నాను.

## భారతదేశము ఎప్పుడునూ దారిద్ర్యముతో బాధపడుచున్నది. ఎందువలన?

భారతీయ పండితులు కర్మఫలత్యాగమును యుక్తులతో చేసినట్లు నటించుచున్నారే కానీ కర్మఫల త్యాగమును చేయుటలేదు. పరీక్షకు పేపరు, పెన్ను వలె ఈ పరీక్షకు కర్మఫలమగు ధనము, నరాకారమున ఉన్న స్వామి కావలయును. ఆహారమును విగ్రహమునకు చేయి చూపించి దానిని ప్రసాదముగా తీసుకొనుటలో స్వామి ఒక్క మెతుకు కూడా తినలేదు. మరియొక్క అతి తెలివి ఏమనగా మానవుడు ఆహారమును భుజించి మానవుడే మాధవుడు కావున మాధవుడే భుజించినట్లుగా భావించుచూ స్వామికి కర్మఫలత్యాగమును చేసినట్లుగా పలుకుచున్నాడు. ఇట్టి అతితెలివి మార్గములలో కర్మఫలము నిజముగా వారి వద్దనే ఉన్నది. ఈ విధముగా భారతీయ పండితులు తమ లోభమును అతి తెలివితేటలతో కప్పి పుచ్చినారు. హృదయము ప్రేమతోను, బుద్ధి తెలివి తేటలతోను నిండియుండును. భారతీయులు స్వామికి బుద్ధిలోనున్న తెలివిని, కుటుంభమునకు హృదయములో నున్న ప్రేమను త్యాగము చేసినారు. విదేశములలో వారు కుటుంబమునకు తెలివిని, స్వామికి ప్రేమను ఇచ్చుచున్నారు. ప్రేమ యొక్క ఫలమే కర్మఫలత్యాగము. తెలివియొక్క ఫలములే ధ్యానము, స్తోత్రము మొదలగునవి. ఈ తెలివియే భారతదేశమునకు దారిద్ర్యమును తెచ్చినది. చేతిలోనున్న పేలపిండి గాలికి ఎగిరిపోయినచో దానిని "రామార్పణం" అను స్థాయికి భారతీయుల తెలివి పెరిగినది. విదేశీయులు సంపాదించి అనుభవించి మిగిలిన దానిని త్యాగము చేయుచున్నారు. వారు తమ పిల్లలను వయస్సు రాగానే సంపాదించి జీవించమని బయటకు పంపుచున్నారు. భారతదేశములో ఉన్న కుటుంబ బంధములకన్ననూ విదేశములలో ఉన్న కుటుంబ బంధములు చాలా బలహీనమైనవి. కావున విదేశీయులహృదయములలో కుటుంబ బంధముల ద్వారా కారిపోని ప్రేమ ఎక్కువగా మిగిలియున్నది. వారు భగవంతుని గురించి తెలియగనే ఆ ప్రేమ అంతయును విజృంభించి స్వామి మీదకే మరలించబడుచున్నది. వారి కర్మఫలత్యాగము పూర్ణము కావున త్వరగా స్వామిని చేరుకొనుచున్నారు. వారి బుద్ధులు సేరిగా ఉన్నవి. కావున కనీసము పిల్లలకు సైతము దాచుట లేదు. కావున వారి దేశములను సంపన్నదేశములుగా స్వామి అనుగ్రహించినారు. భారతదేశములో ఎంత జ్ఞానము వర్షించినా ఇంకి పోవుచున్నదె కాని ఆచరణలో ఉపయోగించుటలేదు. విదేశములలో గట్టి నేలపై వర్షించిన వాన నదివలె ప్రవహించినట్లు జ్ఞానము అందరికీ ఉపయోగపడుచున్నది. సైన్సులో కూడా విదేశీయులు ఆచరణమునకు ప్రాధాన్యతను ఇచ్చుచుండ భారతీయులు మేధాశక్తితో చర్చలతో గడుపుచున్నారు. ఈ స్వభావము అధ్యాత్మిక సంప్రదాయము నుండి భారతీయులకు సంక్రమించినది. అందుకే భారతదేశమును స్వామి అపార మేధా శక్తితోను, విదేశీయులను అపార ధనములతోను అనుగ్రహించినారు. "ఎవరు ఎట్లు నన్ను సమీపింతురో వారిని అట్లు సమీపింతును" అని గీతా వాక్యము.

ఈ పూర్ణిమ పూర్ణ చంద్రుడు ధనమును, మనస్సును సూచించును. కావున నీ పూర్ణ ప్రేమను కర్మఫల త్యాగము ద్వారా పూర్ణ విశ్వాసముతో కూడిన మనస్సుతో సద్గురువునకు గురుదక్షిణగా ఇచ్చుటయే. పూర్ణిమ నాడు దత్తుడు సాక్షాత్కరించినందున ప్రతి పూర్ణిమ నాడు మీరు గురుదక్షిణ ద్వారా కర్మఫలత్యాగము చేయవలెను. కాని గురువుకు ప్రదక్షిణములను చేయుట కాదు. భారతీయులు తప్పుదిద్దుకొని కర్మఫలత్యాగమును నేర్చుకొని తమ దేశమును సంపన్న దేశముగా స్వామి అనుగ్రహముద్వార సాధించవలయును. భారతీయుల ఆధ్యాత్మిక కేంద్రములు సైతము విదేశ ధనముల ద్వారానే వృద్ధి చెందిన విషయము స్పష్టమే కదా. స్వామి వివేకానందుడు "ఇంత జ్ఞానముతో ఉన్న నా భారతదేశము ఇంత దారిద్ర్యముతో ఏల భాధపడుచున్నది?" అని పెద్దగా ఏడ్చినాడు. దానికి స్వామి ఇచ్చు సమాధానమే ఇది.

శ్రీ దత్తుని పాదముల వద్దనున్న కుక్కలు కాపలా పనిని చేయుచూ కర్మ సంన్యాసమును చూపుచున్నవి. గోవు తన దూడను సైతము వదలి తన పాలను దత్తునికి ఇచ్చుచూ కర్మఫలత్యాగమును చేయుచున్నది. కర్మఫల త్యాగముతో కూడిన కర్మసంన్యాసమే కర్మయోగము. కేవలము కర్మసంన్యాసము కన్ననూ కర్మయోగమే గొప్పదని గీత. "తయోస్తు..." అని చెప్పుచున్నది. అనగా సద్గురువు చేయు జ్ఞాన, భక్తి ప్రచారమునకు చేయు సేవయే కర్మయోగము. ఇదే కేవలము దత్తుని చేరు మార్గము. యోగ వాశిష్టములో శ్రీ రాముని ముందు ధనమునార్జించి గురుదక్షిణ తెమ్మని వసిష్టుడు ఆదేశించినాడు.

"గురుసాక్షాత్పరబ్రహ్మ" గురువు అనగా సద్గురువగు "శ్రీ దత్తుడే". బిక్షల ద్వారా, గురుదక్షిణల ద్వారా నిరూపించబడిన నీ భక్తికి సంతసించి, అతడే నీ పాపములను, నీ భక్తికి తగు ప్రమాణములో గ్రహించి నిన్ను ఈ లోకములో సుఖముగా ఉంచి సాధన చేయించగల సమర్థుడు. సాయి తనకు సమర్పించు రొట్టెలు వారి పాపములు అని చెప్పినారు. పేదవాడు ఇచ్చు రూపాయి గురుదక్షిణ ధనికుని లక్షలతో సమానము. సద్గురువువలె జీవుడు సమర్థుడు కాడు. ప్రాచీన కాలంలో పండితులు ఎవరి ఇంటనూ భుజించుట కాని, దక్షిణలను స్వీకరించుట కానీ చేసెడివారు కారు. (అపరిగ్రహ వ్రతము). ఇందుకె ఈ రెండింటికీ అవకాశము కల పౌరోహిత్యమును తప్పని సరికానిచో చేయుటకు ఇష్టపడెడి వారు కాదు. తన పాపములతోనె సతమతమగుచుండగా ఇతరుల పాపములను స్వీకరించి అనుభవించగల ఓర్పు, శక్తి జీవులకు ఉండదు. కావున ఒకరి ఇంట భోజనము చేయక వైశ్వదేవమును పాటించెడివారు. అందుకే భోజనము, బహుమానములను గుర్తుంచుకొని మరల చెల్లించుచుందురు.

సద్గురువు దక్షిణలను, మరల జ్ఞాన, భక్తి ప్రచారములకు దరిద్రులగు భక్తులకు సాయపడుటలోను ఉపయోగించి లోకకళ్యాణమునకే పాటుపడును. మరియు సద్గురువు బిక్షలద్వారా పొందిన అన్న శక్తిని కూడా జ్ఞాన బోధలోనే ఖర్చు చేసి జీవులను ఉద్ధరించును. ఇట్టి త్యాగము వలన దత్తుడు అను శబ్దము స్వామి సార్థకమైనది.

[స్వామి ప్రవచనము వినగానే భక్తులందరునూ ప్రతి నెలా ఈ జ్ఞాన, భక్తి ప్రచార కార్యమునకు యధాశక్తిగా గురుదక్షిణలను అందచేయుటకు నిశ్చయించుకున్నారు. స్వామి తరువాత రెండు గంటలు భజన చేసినారు. భజన సమయములో స్వామి నుండి సుగంధము వచ్చినది. తరువాత 20 ని.లు మరల విపరీతముగా వచ్చినది. ఒక భక్తునకు నీలి రంగులో పాదములు కనిపించినవి. మరియొక భక్తుడు స్వామిని షిరిడి సాయి దర్శనము అర్థించగా వానికి ప్రకాశించు నేత్రములతో షిరిడీ సాయిగా స్వామి దర్శనము ఇచ్చినారు.

ఈ జ్ఞాన, భక్తి ప్రచార యజ్ఞమునకు ప్రతి నెలా పూర్ణిమకు గురుదక్షిణలను ప్రకటించిన ఈ క్రింది భక్తులు శ్రీ దత్త పూర్ణ అనుగ్రహమునకు పాత్రులగుచున్నారని చెప్పుటకు సంతసించుచున్నాము.

1. శ్రీమతి ఎస్.గాయత్రి, చంద్రశేఖర్ గారు. రు. 10,000/-
2. శ్రీమతి నాగలక్ష్మి అజయ్ రు. 7,000/-
3. శ్రీమతి ఉమ, రామనాథ అయ్యర్ రు 5,000/-

మిగిలిన వారు 100 నుండి 1,000 వరకు ప్రకటించినారు.]

# విశ్వమత సమన్వయము

## (స్వామి మరియు క్రిస్టియన్ ఫాదర్ మధ్య జరిగిన సంభాషణ)

ఒకసారి స్వామి నరసరావుపేట-విజయవాడ రైలులో ప్రయాణించుచున్నారు. ఒక క్రిస్టియన్ మతస్థుడైన ఫాదర్ కూడా స్వామితో ప్రయాణించుచున్నారు. స్వామి మరియు ఫాదర్ మధ్య జరిగిన సంభాషణ:

**ఫాదర్**: నాయనా విను, క్రీస్తును నమ్మి ఆరాధించని వారు శాశ్వత నరకమున పడిపోవుదురు. ఇది మా మత ధర్మము.

**స్వామి:** క్రీస్తు పుట్టక ముందు జీవులకు ముక్తిలేదా? దేవునకు, ఆ తరముల వారికి ఈ అవకాశమును ప్రసాదించని కారణమున పక్షపాతము వచ్చినది గదా! అనగా క్రీస్తు ముందు తరముల వారిని నిష్కారణముగా అనుగ్రహించకపోవుట తప్పుకదా!

**ఫాదర్**: క్రీస్తు పూర్వము యెహోవా పేరుతో దేవుడున్నాడు. కావున దేవునకు ఈ నింద రాదు. యెహోవాను ఆరాధించిన వారు కూడా పరలోకమునకు పోవుదురు.

**స్వామి:** మంచిది. అయితే ఈ భారతదేశమునకు యెహోవాను గురించి కాని, క్రీస్తును గురించి కాని వాస్కోడిగామా ఇండియాకు రాకముందు ఏమీ తెలియదు. మరి ఈ భారతదేశమున వాస్కోడిగామా రాకముందున్న జీవులందరును నిష్కారణముగా అన్యాయముగా నరకమునకు పోయినారు. వారికి యెహోవా క్రీస్తుల గురించి తెలియకపోవుట వారి తప్పుకాదు. తెలిసి ఆరాధించకపోయినచో వారి తప్పు ఒప్పుకొనవలసినదే. వారికి భగవంతుడు యెహోవా, క్రీస్తుల గురించి తెలియచేసి ఉండవలెను. అనగా ఒక చిన్న దేశమునకే కాక, అన్ని దేశములనున్న సర్వజీవులకు యెహోవా, క్రీస్తుల గురించి ఏల తెలియబడలేదు? ఒకేసారి కేవలము ఒక దేశమునకే యెహోవా, క్రీస్తుల గురించి ఏల పరిమితమైనది? ఆ దేశము వారికి అవకాశము ఇచ్చుట దేవుని పక్షపాతముకదా? మీ సిద్ధాంతమున జీవునకు పునర్జన్మ లేదు. కావున భారతదేశమున ఆనాటి తరములందరును యెహోవా, క్రీస్తుల గురించి తెలియక అన్యాయముగా నరకమున పడినారు! పోనీ మరల భూమిపై జన్మించి యెహోవా, క్రీస్తుల గురించి ఇప్పుడు తెలుసుకొను అవకాశము కూడా లేదుకదా. ఏలననగా వారికి పునర్జన్మ లేదు కదా! కావున మీ వాదము దేవునకు పక్షపాతము అంటకట్టుచున్నది అనుట నిస్సంశయము.

**ఫాదర్**: సరే దేవుడు పక్షపాతము కలవాడన్న వాదము మీ మతమునకు అంటక తప్పదు. ఏలననగా మీరు నారాయణుడు, కృష్ణుడు తెలియనివారు నరకమున పడుదురని వాదించుచున్నారు గదా. విదేశములకు పాత కాలములో నారాయణ, కృష్ణుల గురించి తెలియ నరకమున పడినందున మీ దేవునకు గూడ పక్షపాతము వచ్చినట్లే గదా!

**స్వామి:** మంచి ప్రశ్న వేసినావు. క్రీస్తు, యెహోవాల గురించి తెలియని వారు నరకమున పడుదురనువారు వీర క్రైస్తవులు. అలానె కృష్ణుడు, నారాయణుడు గురించి తెలియని వారు నరకమున పడుదురన్న మా హిందువుల శాఖ వారు వీర వైష్ణవులు. ఈ రెండు మతముల వలే వీర శైవులునూ ఉన్నారు. వీరు శివుని ఆరాధించకపోయిన నరకప్రాప్తియని వాదింతురు. హిందూ మతములో వీరశైవ, వీరవైష్ణవ మతములవారు ఇట్లే కలహించుకొనుచున్నారు. హిందూ మతము

ఒక చిన్న విశ్వముగా ఉన్నది. హిందూ మతములోని అవాంతర మతములగు శైవ, వైష్ణవ మతములలోనే ఏకత్వమును చూడలేని వారు, ప్రపంచ మతములలో ఏకత్వమును చూడగలరా? ఇంటిలోని గోడలను పగులకొట్టి, ఇల్లు మొత్తము ఒకే హాలు చేయలేని వారు, ఇండ్ల మధ్యగోడలను పగులకొట్టి అన్ని ఇళ్ళను ఒకే ఇల్లు చేయగలరా? కావున ఈ వీర మతములన్నియు దేవునకు పక్షపాతమును తెచ్చుచున్నవి. కానీ, దేవుడు నిష్పక్షపాతియని నిరూపించుటకు ఒకే ఒక మార్గమున్నది. అది ఏమనగా--అన్ని కాలములందును, అన్ని దేశములందును, ఒకే దేవుడు భిన్న రూపములతో వచ్చి, ఒకే జ్ఞానమును బోధించి యున్నాడు. కావున, ఆ జ్ఞానమును అనుసరించినవారు అన్ని కాలముల, అన్ని దేశములాలో ముక్తులగుచున్నారు. అనుసరించని వారు అన్ని కాలముల, అన్ని దేశముల నరకమున పడుచున్నారు.

చూడండి! ఈ సిద్ధాంతములో దేవుడు నిష్పక్షపాతియని నిరూపించబడుచున్నాడు. ఇంతకన్న వేరు మార్గము లేదు. కావున, నీ దేశకాలములకు సంబంధించిన నీ మతములో నీవు ప్రయాణము చేయుము. తప్పక లక్ష్యము చేరుదువు. పరమతమును విమర్శించవద్దు. నీ మతమును ఇతర మతస్థులపై రుద్దవలదు. అది మతాహంకారము అగును. నీవు తలవంచుకొని, పక్క మతములవైపు చూడక నీ మతమున ప్రయాణించినచో నీవు తప్పక దేవుని చేరుదువు. అన్ని నదులూ, సముద్రమునే చేరును. ఒక నది "నేనే సముద్రమును చేరుచున్న ఏకైక నదిని" అని అహంకరించినచో, దేవుడు ఆ నదికి అడ్డముగా ఆనకట్టను కట్టించును. ఆ నదితప్ప, ఇతర నదులన్నియును సముద్రమును చేరును! నీవు నీ మతములో ముందుకు పోతే లక్ష్యమును చేరగలవు. అట్లుకాక అడ్డముగా పరమతంలోకి పోతే, ఆ మతంలో లక్ష్యము నుండి అదే దూరములో ఉంటావు.

నీ మతమును స్తుతించుము. కాని ఇతర మతమును నిందించకుము. దేశ కాల భేదము వలన భాషా వ్యవహార సంస్కారములు మారుచున్ననూ, మానవుడు ఒక్కడే. అలానే అన్ని దేశములందు అవతరించిన అవతారములలో కూడా దేశ కాల భేదము కనిపించిననూ, దేవుడు ఒక్కడే. అలానే దేవుని చేరు మార్గములైన మతములలో -- క్రీస్తు ఎలా భక్తుల పాపములను తాను భరించి, జీవులకు పుణ్య ఫలములనిచ్చు దయామయుడో అలానే కృష్ణుడు కూడా, కుచేలుని పాప ఫలమగు దారిద్ర్యమును తాను తీసుకొని, తన సంపద నంతయును భక్తుడగు కుచేలునకు ఇచ్చుటకు సిద్ధపడ లేదా? "అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి - అనగాఅ మీ పాపములనన్నింటి నుండి మీకు విముక్తినిచ్చుచున్నాను." అని అనలేదా? కావున క్రీస్తు అయినా, కృష్ణుడు అయినా ఆ కరుణాతత్త్వము ఒక్కటే.

దత్తావతారములన్నియును భక్తుల పాపకర్మఫలములను ఆకర్షించుకొని తాము అనుభవించి, భక్తులకు సౌఖ్యమును కలిగించుట అందరూ చూచుచున్నారు కదా! (స్వామి తన భక్తుల రోగములను ఎన్నిసార్లు తనపై ఆకర్షించుకొని అనుభవించుట, స్వామి భక్తులమైన మనము ఎన్నిసార్లు చూడలేదు?)

ప్రతి మతములోను జీవులు వివిధ స్థాయిలలో ఉన్నారు. ఆ స్థాయిలననుసరించి, ఆ మతములోనే వివిధ బోధలున్నవి. ఆంధ్రలో, స్కూల్, కాలేజీ స్థాయిలలో సిలబస్ లు తెలుగులో ఉన్నవి. తమిళనాడులో అదే స్కూల్ కాలేజీ సిలబస్ లు తమిళములో ఉన్నవి. రెండు రాష్ట్రములలోను స్కూల్ సిలబస్ ఒక్కటే. అలానే కాలేజీ సిలబస్ కూడా ఒక్కటే. ఏ రాష్ట్ర విద్యార్థి అయినా స్కూల్ విద్యార్థి కన్నా కాలేజీ విద్యార్థి గొప్పయగును. అలానే, నీవు ఏ మతస్థుడవైననూ నీవు స్కూల్ స్థాయిలో ఉన్నావా? లెక కాలేజీ స్థాయిలో ఉన్నావా అనునది ముఖ్యము. తెలుగు స్కూల్ విద్యార్థి, తమిళ కాలేజీ విద్యార్థి

కన్నా గొప్ప కాదు. రెండు భాషలు సమానమే. అయితే స్కూల్ సిలబస్ కన్నా కాలేజీ సిలబస్ గొప్పది. తమిళ స్కూల్ విధ్యార్థి తెలుగు స్కూల్ లో చేరినంత మాత్రమున గొప్పవాడు కాదు.

కావున నీ మతమును మార్చుకొనుట కాదు. నీ మతములో పై స్థాయికి పొమ్ము. అప్పడు గొప్పవాడగుదువు. నీ తమిళ భాషలోనే స్కూల్స్, కాలేజీ రెండూ ఉన్నవి. నీవు తెలుగు మీడీయంకు మారనక్కరలేదు. అలానే ప్రతి మతములోను ఆది నుండి అంత్య స్థాయి వరకును జ్ఞానమున్నది. ఈ సత్యమును తెలియక పోవుటయే అజ్ఞానము. ఇదే మత ద్వేషములకు మూలమై ఇహలోకములో సుఖముగా ఉండుటకే అడ్డుగా మారుచున్నది. ఇట్టివారు పరలోక సుఖమును పొందుదురా! "ఉట్టికెక్కలేనివారు స్వర్గమునకు ఎక్కగలరా?"

ఈ సంభాషణము జరిగిన తరువాత ఆ ఫాదరు లేచి స్వామికి నమస్కరించి ఆశ్రునయనాలతో ఇలా అన్నారు. "క్రీస్తు మరల వచ్చును అన్నమాట నేడు సత్యమైనది. క్రీస్తు తప్ప ఎవరును ఇలా బోధించలేరు". స్వామి ఇంటికి రాగానే "చూశారా! అతడెంత విశాల హృదయుడో అన్ని మతములలోను మంచి వారున్నారు. అట్టి వారి కొరకే నా యీ జ్ఞాన ప్రచారము అని వచించారు."

## స్వామి, వెంకటేశ్వర స్వామిగా చిత్రము (మొదటి పేజీ)

ఎస్ భీమశంకరం, వసుమతి

అందరి బలవంతము మీద, మద్రాసులో ఇంటర్వ్యూకి వెళ్ళిన ఫణికి స్వామి, ఇదే వెంకటేశ్వరస్వామి అలంకారములో కనిపించి "ఈ ఉద్యోగము ఇవ్వమంటావా?" అని అడిగారట. వద్దు "నీ సేవనిమ్ము" అని ఫణి అన్నాడు. అదే రోజు అదే సమయములో స్వామి విజయవాడలో భక్తులతో "ఇప్పుడే ఫణికి ఉద్యోగమిస్తానన్నాను వద్దు అంటునన్నాడు" అని చెప్పారు. స్వామి ఆ వేషములో ఎలా ఉన్నారని వచ్చిన ఫణిని గుచ్చి గుచ్చి అడుగుచుండగా స్వామి సంకల్పముతో ఈ చిత్రమును శ్రీ శర్మగారు తీసినారు. చిత్రము తీసేటప్పుడు స్వామి ముఖము మీద తెల్లని పౌడరు అద్దినారు. కాని కమేరాలో స్వామి ఇదే నీలం రంగుతో కనిపించసాగినారు. కెమేరాని బయటకు తీస్తూ మరల కనులపై పెట్టుకుంటూ శర్మగారు "ఇదేమిటి స్వామి! బయట తెల్లగా లోపల నీలంరంగుతో కనబడుతున్నారు" అని ఆశ్చర్యపోయినారు. స్వామి నవ్వుతూ "అది నీ సేవాఫలము" అన్నారు. ఈ చిత్రముపై ఇలా సందేశము ఇచ్చినారు. "ఈ జగన్నాటకములో నారాయణుడు నరుడి వేషములో వస్తాడు. నాటకములో నరుడు నారాయణుడి వేషం వేస్తాడు. అసూయాపరులు అహంకారులైన నరులు రెండు సందర్భములలోను సాటి నరుడి ఆధిక్యమును అంగీకరించరు. నరుడినే చూస్తారు. వినయశీలులైన భక్తులు మాత్రము రెండింటిలోను నారాయణుడినే చూస్తూ పరవశిస్తారు. సినిమా చూస్తూ స్వామి వేషంలో ఉన్న నటుడి పేరుతో పిలుస్తూ వేళాకోలం చేస్తే, భక్తి రాదు. కావున దృష్టిని పట్టియే సిద్ధి. ఈ చిత్రంలో, నా లోపల వేషధారిగా ఉన్న నారాయణుడు, దాసుడైన నన్ను వేషధారిగా చేసి, తాను వేషంగా బయటకు వచ్చి తాను దాసులకు దాసుడనని నిరూపించినాడు.."